క్లుప్తంగా

గీతంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, రుద్రారంలోని చరెవైతి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తలసీమియా టాస్క్‌ఫోర్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహకారంతో శిబిరం నిర్వహించారు.'రక్తం దానం చేయడం వల్ల పెద్ద మార్పు వస్తుంది, ఇతరులకు జీవితాన్ని బహుమతిగా ఇవ్వండి' అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 180 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు చెప్పారు.

ఖాదీ మహోత్సవ్...

గీతంలోని జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో 'ఖాదీ మహోత్సవ్ 'ను, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల, మండలి, ఎంఎస్ ఎంఈ సహకారంతో సోమవారం ఘనంగా నిర్వహించారు. యువతను చైతన్యవంతం చేయడం, మన ఆర్థిక వ్యవస్థ, జీవావరణ శాస్త్రం, మహిళా సాధికారత వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించడం, ఖాదీ వస్తువులను కొనుగోలు చేసేలా ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్వహించారు. డీవీవీఎస్ఆర్ వర్మ, రెసిడెంట్ డెరెక్టర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ సీవీ నాగేంద్రకుమార్, జియో సిరిల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీహెచ్‌ఈఎల్ హౌసింగ్ సొసైటీ నూతన కార్యవర్గం

శేరిలింగంపల్లి: బీహెచ్ఈఎల్ ఎంఐజీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. ఈ నెల 28వ తేదీన జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన మేనేజింగ్ కమిటీ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.వెంకట్రావ్, ఉపాధ్యక్షులుగా ఎస్.నారాయణ, కార్యదర్శిగా కెవీ.సుబ్బారావు, కోశాధికారిగా ఎం.నీలకంఠరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా చింత రాములు, సి.విద్యాధరిలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను కాలనీవాసులు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

విదేశీ విద్యకు మార్గదర్శకత్వం



మాదాపూర్ శాఖను ప్రారంభిస్తున్న జూలూరి గౌరీశంకర్, చక్రపాణి తదితరులు

మాదాపూర్: విదేశాలలో చదవాలనుకునే విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో ఐఎంఎఫ్ఎస్ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఇన్ ఫారిన్ స్టడీస్)ను ఏర్పాటు చేసినట్లు సీఈఓ సింగ్ తెలిపారు. మాదాపూర్‌లో దేశంలోనే పేరుగాంచిన అంతర్జాతీయ విద్యా కన్సల్టెన్సీ ఐఎంఎఫ్ఎస్ కొత్త శాఖను సోమవారం ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, టీఎస్పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీసాగర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ కేపీ.సింగ్ మాట్లాడుతూ జీఆర్ఈ, జీమ్యాట్, టోఫెల్, ఐఈఎల్టీస్ , ఎస్‌టీఏ లాంటి ప్రామాణిక పరీక్షల్లో విద్యార్థులు మంచి స్కోర్లు సాధించడానికి టెస్ట్ ప్రిపరేషన్ విభాగం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ,ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్, ఐఎంఎస్ఎఫ్ డైరెక్టర్లు వేముల పాటు అజయ్‌కుమార్, మేడిశెట్టి శ్రీనివాస్, సెయింట్ ట్రిబ్ వ్యవస్థాపకుడు లక్కరాజు శ్రీకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నగరవ్యాప్తంగా 'గివ్'..

సాక్షి, సిటీబ్యూరో: ఐటీ ఆధారిత వైద్య సేవలకు పేరొందిన ఆప్టమ్ సంస్థ తమ జియోగ్రాఫికల్లీ ఇన్‌క్లూజివ్ వాలంటీర్ ఈవెంట్‌లో భాగంగా నగరవ్యాప్తంగా పలు ఎన్‌జీవోలు, వాలంటీర్లతో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. గత కొన్ని రోజులుగా చేసిన వాటిల్లో...ఎన్‌జీఓ గూంజ్‌తో కలిసి అనాథలకు దుస్తుల సేకరణ, తలసీమియా సికిల్‌సెల్ సొసైటీతో కలిసి రక్తదాన శిబిరాలు, ఎల్వీప్రసాద్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి కంటి వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు , ఆదరణ సంస్థతో కలిసి అన్నదానాలతో పాటు ఆశ్రయ్, ఆకృతి, చైల్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఫర్ హోలిస్టిక్ రూరల్ డెవలప్మెంట్, స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్‌లతో కలిసి పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు.

కాంగ్రెస్‌లో అసమ్మతి రాగం

- తీవ్ర అసంతృప్తిలో జైపాల్, రఘునాథ్ యాదవ్
- అసమ్మతి నేతలతో చర్చలు విఫలం



కాంగ్రెస్ నాయకులు రఘునాథ్ యాదవ్



కాంగ్రెస్ నాయకులు జెర్రిపాటి జైపాల్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి రాగం తారాస్థాయికి చేరింది. పార్టీ అధిష్టానం ప్రకటించిన అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్‌తో సాగబోమని నేతలు తెగేసి చెబుతున్నారు. నిన్నటి వరకు కాంగ్రెస్ జెండా మోసిన నాయకులు పార్టీ అభ్యర్థి ఎంపికపై తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చడం గమనార్హం. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న జెర్రిపాటి జైపాల్ శేరిలింగంపల్లి టికెట్‌ను ఆశించారు. అలాగే బీజేవైఎం రాష్ట్ర కోశాధికారిగా ఉన్న మారబోయిన రఘునాథ్ యాదవ్ ఆరు నెలల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వర్గంలో ఉన్నపుడు కొద్ది నెలలుగా నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ నాయకుడు, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ అయిన జగదీశ్వర్ గౌడ్ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. టికెట్ ఖాయం చేసుకొని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జగదీశ్వర్ గౌడ్, ఆయన సతీమణి పూజిత కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. రెండు డివిజన్లలో పట్టు ఉందని అధిష్టానం రెండో జాబితాలో జగదీశ్వర్‌గౌడ్ పేరును ప్రకటించింది. దీంతో అటు జైపాల్, ఇటు రఘునాథ్ యాదవ్‌లు అధిష్టానం తీరుపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు.

జైపాల్ రూటు ఎటు?

కొందరు కాంగ్రెస్ పెద్దలు సంప్రదింపులు జరిపేందుకు జెర్రిపాటి జైపాల్ ఇంటికి వెళితే ఆయన విముఖత చూపినట్లు తెలిసింది. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ నేరుగా భేటీ అయ్యేందుకు వెళ్లినా ససేమిరా అన్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాహుల్ గాంధీ జోడోయాత్రలో భారీగా ఖర్చు పెట్టినా, జెండా పట్టుకున్న నాయకులను గుర్తింపు ఇవ్వలేదని తన అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. జైపాల్ కాంగ్రెస్‌లోనే ఉంటాడా.. లేక వేరే పార్టీలో చేరతారా అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

రెబల్‌గా బరిలో రఘునాథ్ ?

నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఊపుతెచ్చిన తనను కాదని జగదీశ్వర్‌గౌడ్‌కు టికెట్ ఎలా ఇస్తారని కాంగ్రెస్ నాయకులు రఘునాథ్ యాదవ్ ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని చెబుతూనే రెబల్‌గా బరిలో ఉంటానని పేర్కొనడం గమనార్హం. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్ కలిసేందుకు వెళితే రఘునాథ్ యాదవ్ కలవనని చెప్పినట్లు సమాచారం. ఇప్పటికే ఆయన అనుచరులు, కార్యకర్తలతో సమావేశమై భవిష్యత్ నిర్ణయంపై చర్చిస్తున్నారు. మరో మూడు రోజుల్లో నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుండటంతో అసమ్మతి నేతల తీరు ఎలా ఉంటుందోనని పలువురు పేర్కొంటున్నారు. అధిష్టానం చర్చలు జరిపి అసమ్మతి నేతలను బుజ్జగించితేనే టీ కప్పులో తుఫాన్‌లా సమస్య పరిష్కారం కానుంది. కలిసి వస్తారా లేక అసమ్మతి నేతలుగా మిగిలిపోతారా అనేది త్వరలో తేలనుంది.

సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీకి శ్రీరామరక్ష





తారానగర్‌లో ప్రచారం చేస్తున్న గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ , మహిళలు

- ప్రభుత్వ విప్ గాంధీ..
- తారానగర్‌లో ఇంటింటి ప్రచారం

శేరిలింగంపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీకి శ్రీరామరక్ష అని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. సోమవారం శేరిలింగంపల్లి తారానగర్ శ్రీ తుల్జాభవానీ అమ్మవారి ఆలయంలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.9 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను వివరించారు.ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. తారానగర్‌లో ఇంటింటికి వెళ్లి ఓటు అడిగారు. యువకులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు.

బీజేపీ గెలుపులో భాగస్వాములవ్వాలి



రంగారావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న రవికుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: బీజేపీలో గతంలో క్రియాశీలకంగా పనిచేసి తదనంతరం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న బల్లురి రంగారావును సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ గెలుపులో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పర్వతాలు యాదవ్, నరసింహాచారి, గోపాలరావు, సీతారామరాజు, బాలుయాదవ్, ఆంజనేయులు యాదవ్, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

'మనూ మేరా యువ భారత్' వర్క్‌షాప్



సమావేశంలో మాట్లాడుతున్న డీన్ ప్రొ.అలీమ్ అష్రఫ్

రాయదుర్గం: యువత తమ శక్తిని సద్వినియోగం చేసుకోవాలని ఉర్దూ విశ్వవిద్యాలయం స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ అలీమ్ అష్రఫ్ సూచించారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ సహకారంతో, మనూ నేషనల్ సర్వీస్ స్కీమ్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మనూ మేరా యువభారత్' పేరిట వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ యువతకు శక్తినిస్తుందన్నారు. 21వ శతాబ్దంలో దేశ భవిష్యత్తును రూపొందించడంలో భారతదేశ యువత కీలకపాత్రను పోషిస్తారన్నారు. సాంకేతిక, సామాజిక రంగాల్లో పూర్తి సామర్థ్యాన్ని సాధించేందుకు విద్యపై దృష్టి పెట్టాలని కోరారు. కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాధిపతి ప్రొ.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ విభజనను తగ్గించడానికి, దేశవ్యాప్తంగా యువతకు సాధికారత కల్పించడానికి డేటా ఆధారిత విధానం అవసరమన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ యూసుఫ్‌ఖాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కమరుద్దిన్, డాక్టర్ జరార్ అహ్మద్ ప్రసంగించారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



అపార్ట్‌మెంట్‌వాసులతో మాట్లాడుతున్న రవికుమార్ యాదవ్

మియాపూర్: బీజేపీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి కుమార్ యాదవ్ కోరారు. సోమవారం మియాపూర్‌లోని మందాడి అపార్ట్‌మెంట్‌వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ మద్దతు తెలిపారు. గతంలో భిక్షపతి యాదవ్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధే తప్ప ఇప్పుడు జరిగిన అభివృద్ధి ఏమిలేదన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడి దేశంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్రహ్మానందారెడ్డి, నర్సింహరాజు, లక్ష్మణ్, పవన్ యాదవ్, పాపయ్య, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పదేళ్లలో తాను చేసిన అభివృద్ధిని చూసి మరొకసారి ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు.సోమవారం తెల్లాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు వెంకటయ్యగౌడ్, వెంకటస్వామిగౌడ్, రమేష్‌గౌడ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ..పదేళ్ల కాలంలో నియోజకవర్గాన్ని వేల కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేకమంది బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్ ,నాయకులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెల్లాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

ఎన్నికల నిర్వహణలో పీఓ ,ఏపీఓలు కీలకం

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



ప్రొసీడింగ్ అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల నిర్వహణలో పీఓ ,ఏపీఓలు కీలకమని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు.సోమవారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో ప్రొసీడింగ్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులకు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శిక్షణ నిర్వహించారు.మొత్తం 434 మంది పీఓ ,ఏపీఓలు హాజరు కావాల్సి ఉండగా 400 మంది హాజరయ్యారు.ఈ సందర్భంగా వీరికి మాస్టర్ ట్రైనర్లు అమరేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి ,అల్లం రెడ్డిలు ఈవీఎం మాక్ పోలింగ్, ఈవీఎం సీలింగ్, పోలింగ్ సమయంలో వచ్చే సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించి, ఈవీఎం ,వీవీ ప్యాట్ల ప్రాక్టికల్స్ చేయించారు. శిక్షణకు సోమవారం హాజరు కాని పీఓ ,ఏపీఓలు మంగళవారం హాజరు కావాలన్నారు. లేని పక్షంలో ప్రొసీడింగ్ ,అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ భాస్కర్, మాస్టర్ ట్రైనర్‌లు మురళి, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

డిజిటల్ యుగం.. ఉపాధ్యాయులు తప్పనిసరి

రాయదుర్గం: ప్రస్తుత డిజిటల్ యుగంలో తరగతి గదిలో ఉపాధ్యాయుల ఉనికి తప్పనిసరి అని రాజస్థాన్ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ఫుర్కాన్ కమర్ అన్నారు. మనూలో యూజీసీ–హెచ్‌ఆర్‌డీసీ, మాల్వియా మిషన్ టీచర్స్ ట్రైనింగ్ సెంటర్(ఎంఎంటీటీసీ) ఆధ్వర్యంలో రెండు వారాల రిఫ్రెషర్స్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు డిజిటల్ స్పేస్‌లను కలిగి ఉంటున్నాయని, డిజిటల్ సాధనాలు విద్యకు అనుబంధంగా ఉంటాయయే కానీ ఉపాధ్యాయులను భర్తీ చేయలేవన్నారు. కార్యక్రమంలో యూజీసీ ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్ ఫాతిమా ప్రసంగించారు.

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: జార్ఖండ్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అబ్దుల్ అన్సారీ(26) బతుకుదెరువు కోసం వచ్చి పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉంటూ, పారిశ్రామికవాడలో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఈ క్రమంలో ఈ నెల 22వ తేదీన జార్ఖండ్ రాష్ట్రానికి వెళ్తున్నానని బ్యాగు తీసుకుని ఇంటి నుండి వెళ్లిన అబ్దుల్ అన్సారి ఇంటికి చేరుకోలేదు.దీంతో అన్న కుర్షిద్ అన్సారీ సోదరుడికి ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చిందని, స్వగ్రామంకు ఫోన్ చేసినా రాలేదని చెప్పడంతో పోలీస్‌స్టేషన్ ను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్.. వ్యక్తికి గాయాలు



మియాపూర్: ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో గ్యాస్ సిలిండర్ పేలి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ...దీప్తిశ్రీనగర్ కాలనీలో ప్రధాన రహదారి పక్కన ఫుట్‌పాత్‌పై ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలింది. అదే సమయంలో పక్కనే ఉన్న టీ కేఫ్ యజమాని ప్రసాద్ షాపు తీసేందుకు వచ్చాడు. గ్యాస్ సిలిండర్ పేలుడు ధాటికి అతనికి తీవ్ర గాయాలయ్యాయి. షెడ్డు పైకప్పు ధ్వంసమైంది. తెల్లవారు జామున ఎవరూ లేని సమయంలో ప్రమాదం జరగడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా కొంత కాలంగా ఈ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ మూసి ఉన్నట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన ప్రసాద్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

6 లీటర్ల మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా విక్రయించేందుకు తీసుకువచ్చిన ఆరు లీటర్ల మద్యంను పోలీసులు పట్టుకున్నారు. అమీన్‌పూర్ ఎస్ఐ ఈ.వి రమణ కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని పీఎస్ఆర్ కాలనీ సమీపంలో గుడిసెలు వేసుకుని ఉంటున్న వడ్డే మల్లేష్ బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం రావడంతో సోమవారం దాడులు నిర్వహించి మద్యంను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

బహిరంగంగా మద్యం తాగిన 11మందిపై కేసు

పటాన్‌చెరు టౌన్: బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన 11మందికి జరిమానా విధించి కేసు నమోదు చేసిన సంఘటన పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ సీతారామరెడ్డి కథనం ప్రకారం... అమీన్‌పూర్, రామచంద్రాపురం పరిధిలోని వైన్‌షాప్‌ల వద్ద పర్మిట్ రూమ్‌లో కాకుండా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వారిపై కేసు నమోదు చేసి, జరిమానా విధించామన్నారు.బహిరంగంగా ప్రదేశాలలో ఎవరైనా మద్యం సేవిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ సీఐ సూచించారు. బెల్ట్‌షాప్‌లపై నిఘా ఉంచామని, బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలి

పార్టీ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శేరిలింగంపల్లి పార్టీ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం చందానగర్ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు దొంతి కార్తీక్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి జగదీశ్వర్‌గౌడ్ ఆహ్వానించారు. అదే విధంగా గుల్‌మొహర్‌పార్కు కాలనీవాసి పులిపాటి శ్రీనివాస్, పలు కాలనీలవాసులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో ఎక్కడికి వెళ్ళినా ప్రజలు స్వాగతం పలుకుతున్నారని తెలిపారు.



కాంగ్రెస్‌లో చేరిన చందానగర్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు కార్తీక్‌గౌడ్, యువకులు

త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా

- కాంగ్రెస్ నాయకులు రఘునాథ్ యాదవ్
- పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న రఘునాథ్ యాదవ్

గచ్చిబౌలి: త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని కాంగ్రెస్ నాయకులు రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం కొండాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, అభిమానులతో ఆయన సమావేశమయ్యారు. నన్ను నమ్ముకున్న కార్యకర్తల భవిష్యత్ కోసం ముందుకు సాగుతానన్నారు. రఘునాథ్ యాదవ్ ఫౌండేషన్ సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా శేరిలింగంపల్లి ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.ఆరు నెలలుగా ఇంటింటి ప్రచారం చేస్తున్న తనకు కాకుండా ఇటీవల పార్టీలోకి వచ్చిన జగదీశ్వర్‌గౌడ్‌కు టికెట్ ఇవ్వడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. కొద్దిరోజుల్లోనే రఘునాథ్ యాదవ్ రూట్ ఎటు అనే విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

బీఆర్ఎస్ గెలుపునకు సమష్టిగా పనిచేయాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



ఆల్విన్‌కాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి బీఆర్‌యస్ పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఇంటింటి ప్రచారం చేశారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్1, సాయినగర్ ఈస్ట్, వెస్ట్, ఆదిత్యనగర్‌లలో కారు గుర్తుకే ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అఖండ మెజార్టీతో గెలిచి బీఆర్‌యస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కాశీనాద్ యాదవ్, రాజేష్‌చంద్ర, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, శివరాజ్ గౌడ్, పాండుగౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీనగర్‌లో ఆత్మీయ సమావేశం

శేరిలింగంపల్లి: ఎన్నికల్లో విజయం సాధించి శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు శాయశక్తుల కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ అన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని శివాజీనగర్‌లో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి హాజరైన గాంధీ మాట్లాడుతూ ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులో భాగంగా ప్రయాణం సాఫీగా సాగేందుకు ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణం, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. ఎస్ఆర్‌డీపీలో భాగంగా 10 పనులు చేపడితే వాటిలో 9 పనులు ఇప్పటికే పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు. అనంతరం శివాజీనగర్ వాసులు గాంధీకి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్, కాలనీవాసులు నాగరాజు, శ్రీనివాస్ గౌడ్, సచిన్ అగర్వాల్, ప్రసాద్, పండరీ, రఘునాథ్, ధనుంజయ్ పాల్గొన్నారు.



గాంధీని సన్మానించిన కాలనీవాసులు